# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ "స్వచ్ఛాతా హీ సేవ" కార్యక్రమాలతో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెరుగుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.
- ❖ రాష్ట్రంలో ముస్లిం మైనారిటీ వర్గాలకు వివిధ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- ❖ వెలుగొండ ప్రాజెక్టును త్వరలో పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.
- ❖ రానున్న 24 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

==============================

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి పంపుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేస్తామన్నారు. అమరావతిలోని సచివాలయంలో ఈ రోజు న్యాయశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అమరావతి రాజధానిలో వంద ఎకరాల విస్తీర్ణంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ద్వారా అంతర్జాతీయ న్యాయ విద్యాలయం ఏర్పాటుకు సన్నద్ధం చేయాలని సూచించారు. అదే విధంగా జూనియర్ న్యాయవాదులకు నెలకు గౌరవ వేతనం కింద 10 వేల రూపాయలు చెల్లించే ప్రక్రియను ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులను జూనియర్ న్యాయవాదులకు శిక్షణ కేంద్రం కోసం రాష్ట్రంలో అకాడమీ ఏర్పాటు అంశంపై కసరత్తు చేయాలని కోరారు.

==============================

పారిశుద్ధ్య కార్మికులకు సఫాయి సురక్ష కార్యక్రమం కింద ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో "స్వచ్ఛతా హి సేవ" కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈనెల 17 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు పక్షం రోజుల పాటు "స్వచ్ఛతా హి సేవా" కార్యక్రమాలు దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==============================

ముస్లిం మైనారిటీ వర్గాలకు అందే పథకాలను పునర్ వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మైనారిటీ సంక్షేమంపై అమరావతి సచివాలయంలో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. "ప్రధాన మంత్రి జన్ వికాస్" కార్యక్రమం కింద మంజూరైన 447 కోట్ల రూపాయలకు సంబంధించి పెండింగులో ఉన్న పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో కొంత మేర నిర్మాణాలు జరిగిన షాదీ ఖానాలను పూర్తి చెయ్యాలని ముఖ్యమంత్రి తెలిపారు. కడపలో హజ్ హౌస్ నిర్మాణం పనులను వేగవంతం చేయాలని సూచించారు. అదే విధంగా మైనారిటీ విభాగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలు శిక్షణా సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. ఈ సమీక్షలో మైనార్టీ, రెవెన్యూల శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

==============================

వెలుగొండ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు ఆయన స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ప్రకాశం జిల్లాలోని కనిగిరి నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక చాకిరాల గ్రామ పంచాయతీలో 3 కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభించారు.

==============================

ఉపరితల ఆవర్తన ప్రభావంతో రానున్న 24 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. నిన్నటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం దక్షిణ కోస్తా మయన్మార్ పొరుగు ప్రాంతాలలో నున్న మరొక ఉపరితల ఆవర్తనం తూర్పు-పశ్చిమ ద్రోణితో అనుసంధానించబడిందని, మధ్య బంగాళాఖాతంలో ఒకే ఉపరితల ఆవర్తనంగా కలిసిపోయి సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిందని వెల్లడించింది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి తెలియచేస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

==============================

దేశంలో 3వ సారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తొలి వంద రోజుల పాలనలో అనేక కీలక నిర్ణయాలను తీసుకుంది. రైతుల కోసం 14,200 కోట్ల రూపాయలను కేటాయిస్తూ, 7 పథకాలకు రూపకల్పన చేసింది. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడానికి వీలుగా "డిజిటల్ అగ్రికల్చర్ మిషన్"ను ఏర్పాటు చేసింది.

మహిళలు కొనుగోలు చేసిన ఆస్తులపై స్టాంప్ డ్యూటీలు తక్కువగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పర్యాటక రంగంలో మహిళలకు ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి "పర్యాటన్ దీదీ", "పర్యాటన్ మిత్ర" వ్యవస్థలను ఏర్పాటు చేసింది. 90 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా 10 కోట్ల మంది మహిళలకు ఆర్థికంగా చేయూతను అందిస్తోంది. నారీ శక్తి పథకాల కోసం 3 లక్షల కోట్ల రూపాలయను బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించింది. అలాగే 10 లక్షల మంది మహిళలను "లఖ్ పతి దీదీలు"గా తీర్చిదిద్దింది. అదేవిధంగా యువతలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు 10,600 కోట్ల రూపాయల పెట్టుబడితో "విజ్ఞాన్ ధార్" పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 2లక్షల కోట్ల రూపాలయతో ప్రధానమంత్రి ప్యాకేజీ ద్వారా 4 కోట్ల 10 లక్షల మంది యువతకు లబ్ధి చేకూర్చే కార్యక్రమాన్ని చేపడుతోంది.

==============================

పెండింగ్ లో ఉన్న సాగు, తాగు తాగునీటి ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం అప్పినపల్లిలో గ్రామంలో ఈరోజు కుప్పం బ్రాంచ్ కెనాల్ టెక్ ఆఫ్ పాయింట్ ను మంత్రి పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు సంబంధించిన వివరాలను హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతో పెండింగ్ లో ఉన్న సాగు - తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు నీటి సమస్య రాకుండా చూస్తామన్నారు.

==============================

ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలులో ఈ రోజు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

==============================

విజయనగరం జిల్లాలో ఈ నెల 26వ తేదీన పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా విజయనగరంలోని ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో రామాయణం పరిశోధన కేంద్రాన్ని ఆయన ప్రారంభించనున్నారని ట్రస్ట్ సభ్యులు వెల్లడించారు. ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మాజీ ఎంపి టిజి వెంకటేష్, తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి జిఎస్ఆర్ కృష్ణమూర్తి, హాజరవుతారని వివరించారు.

==============================

తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు దర్శనానికి 2 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. అదే విధంగా 300 రూపాయల ప్రత్యేక దర్శనానికి కేవలం గంట సమయం పడుతోందని పేర్కొన్నారు. వేంకటేశ్వర స్వామి వారిని నిన్న 82 వేల 436 మంది దర్శించుకోగా హుండీ ఆదాయం 4.57 కోట్ల రూపాయలు వచ్చాయని వెల్లడించారు.

==============================

రాష్ట్రంలో అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుతోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఈ రోజు అన్న క్యాంటీన్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తొలి విడతలో 100 రెండో విడతలో 75 క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు.

==============================

సామాజిక బాధ్యతలో భాగంగా సిఎస్ఆర్ ద్వారా అనేక అభివృద్ధి ఉపాధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చేపడుతున్నామని రాజమహేంద్రవరం ఓఎన్జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతన్ దాస్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓఎన్జిసి సమకూర్చిన సైకిల్ పంపిణీ కార్యక్రమంలో అమలపురం లోక్ సభ సభ్యులు గంటి హరీష్ మాధుర్, శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణతో కలిసి ఈరోజు ఆయన పాల్గొన్నారు.

==============================

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం 14 వందల 52 కోట్ల రూపాయల బకాయిలను చెల్లించిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులో ఈరోజు జరిగిన “ఇది మంచి ప్రభుత్వం” కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ తాగునీటి పథకం కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన హాడ్కో ఆర్థిక సాయం అందించిందన్నారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో కూడా “అన్న క్యాంటీన్ల”ను ప్రారంభిస్తామని దీనికి సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు.

==============================

==============================